# యాదృచ్ఛికం




—శ్రీ నీలిమ

చిరాగ్గా ఉంది. అందులోనూ అగరు బత్తీల్లా ఉండే అమ్మాయిలను అందంగా వెయ్యాలంటే అవస్థే మరి! అసలా కాస్ట్యూమ్సు ... ఏవీ తన అభిరుచికి తగ్గవిగా లేవు. అయినా, తప్పదు. ఇది కమర్షియల్ ఆర్ట్! ఇక్కడ అభిరుచులూ, అభిప్రాయాలూ అంటే చెల్లదు — వేలంవెర్రి! ఉన్నంతలో ఒక ఏంగిల్ నిర్ణయించుకొని స్కెచ్ గీయటం ప్రారంభించాడు. కెవ్వుమని కేకవేసి ఆ అమ్మాయి లేచి ముందు కొచ్చింది. "ఇదిగో, మాన్! ... బొమ్మ వేస్తానని కోతి బొమ్మ వెయ్యొద్దు! అది చాలా పాత జోక్! ... తెలుసా? ... ఆఁ" అంటూ గబగబా మళ్ళా స్పాట్‌లో కూర్చుంది.

సుదర్శనం తల బాదుకున్నాడు. "మీరు సరిగ్గా కోఆపరేట్ చెయ్యటం లేదు." విసుగ్గా అన్నాడు. ఇంతలో చెట్టియార్ వగురుస్తూ గదిలో అడుగు పెట్టాడు. "అదే ... రాజామణి ... నీవు యిాడదా వూడిస్తివి ... నీ ఫ్రెండ్సంతా క్రిందదా చూస్తుంటిరి... పోమా! నీకు యిాడనేం పని ..." చెట్టియార్‌ను చూస్తూనే రజియా లేచి నించుంది. "అప్పా ... ఎన్నిసార్లు చెప్పాలి నన్నా పేరుతో పిలవ్వద్దని— రజియా అనలేవూ? ఐ డోంట్ లైక్ దట్ సదరన్ టంగ్!" అని విసురుగా మేడ దిగి పోయింది. మెట్లదగ్గర నించుని సుదర్శనంతో — "ఐ విల్ కమ్ సూన్. థాంక్యూ!" అని గాలిలో చేయి ఊగిస్తూ దిగి పోయింది.

"ఈమె మాడల్ గర్ల్ కాదా! ?" ఆశ్చర్యంగా చూశాడు చెట్టియార్ వు.

"యారప్పా? ... ఇది నా కొడుకు కూతురు. చిన్న తనంలో నార్దన్ ఇండియాలో పెరిగింది. అందమాదిరి మాట్లాడును. నాన్‌దా యిాడనే చదివిస్తుంటిని. కొంచెం గారాబు. మాడల్‌ను ఇప్పుడుదా పంపిస్తును" అని అతను కూడా మెట్లు దిగి పోయాడు.

నిట్టూర్చి సోఫాలో కూలబడిపోయాడు సుదర్శనం. టెలిఫోన్ మోగటం ప్రారంభించింది. ఎవరన్నా వచ్చి తీస్తారని ఉదాసీనంగా ఊరుకున్నాడు. ఎంతకూ ఎవ్వరూ రాకపోవడంతో తప్పనిసరిగా రిసీ

సొల్యూషన్ చెయ్యలేక ఓడిపోయారు." చెప్పింది.

"అయితే, అంతమాత్రానికి నీకు 'అపరాజిత' బిరుదా! అన్యాయం! పద్మశ్రీ కంటే మరీ ఘోరం. ఏమండీ, జోక్ మాస్టారూ! ఇంతేనా తమరి పస? చూస్తారా! నేను మీ తరఫున ఉండి ఆ సొల్యూషన్ చేసి గెలిపిస్తాను."

"రజియా! నీకు బుద్ధిలేనట్టుంది! పద, మనం క్రిందకు పోయి ఏర్పాట్లు చూడాలి." గుర్తుచేసింది ముకుంద.

సుదర్శనానికి ఆ సొల్యూషన్ తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది. "మాడమ్! ఇఫ్ యూ డోంట్ మైండ్ ... ప్లీజ్ ... మరొక్కమారు ఆ ఆట మీ ఇద్దరూ ఆడి చూపించండి. తెలుసుకోవాలని ఉంది."

"క్షమించండి, మాస్టారూ, ఎగ్జిబిషన్ ముగిసేవరకూ ఆ రహస్యం రిలీవ్ చెయ్యకూడదనే నిబంధన ఉంది. అయామ్ వెరి వెరీ సారీ ఫర్ ది రిజెక్షన్! అయినా, మీరు దాన్ని పరాజయంగా తీసుకోనక్కరలేదు. కిటుకు తెలిస్తే ఎవరైనా సాల్వ్ చెయ్యవచ్చు." పొలైట్‌గానే నిరాకరించిం దామె.

"ఓస్ ... పెద్ద పోజ్! ఏం కాదు. నే చెబుతా వినండి! కౌంట్ ప్రారంభించినప్పుడు, మొదట ఎవరు పది చేసుకోగలుగుతారో వాళ్ళే మరి కాస్త జాగ్రత్తపడి పదిహేడుకూడా తమ హాండ్‌తోనే కౌంట్ చేస్తే థర్టీ టూ వాళ్ళకే వస్తుంది. హావ్ యూ నాట్ అండర్‌స్టుడ్! అంతేనా, మేడమ్? ఏ మై రాంగ్!!" ఎకసెక్కంగా చూసింది ముకుందంవేపు రజియా.

"ఉద్ధరించావులే. పద!" రజియాను ముందుకు తోసింది ముకుంద.

"వచ్చేస్తా ... ఉండు ... వన్ మినిట్! ఏదీ ఇందాక నా బొమ్మ వేస్తున్నారు? ఇంకా పూర్తికాలేదా!" అంటూ చరాలున కాన్వాసు మీది తెరను లాగేసింది.

"బాప్‌రే! ... ఎవరిదీ! ! ?" నివ్వెరబోయి క్షణంసేపు నిలుచుండిపోయింది రజియా.

ఆమె కేకకు వెనుదిరిగిన ముకుంద, చిత్రాన్ని చూచి మరికొంచెం దగ్గర కొచ్చింది.

ముడుతలుపడ్డ ఆమె భృకుటి మధ్య ఆశ్చర్యం, ఆందోళన — ఇంకా అలాంటివేవో చిక్కుముడులు పడుతుండటం గమనించాడు సుదర్శనం. క్రుటిలో ఆ భావాలను తుడిచేసుకుని వీలైనంత స్వచ్ఛంగా కనిపించి, నిటార్చింది. మరోమారు సుదర్శనం కళ్ళలోకి అనుమానంగా చూచి చరచర క్రిందకు దిగిపోయింది రజియాతో.

ఆ తీరూ జోరూ అవగాహనకు రాలేదు సుదర్శనానికి. ఎందు కీమె మరీ ఇంత నిరంకుశంగా ప్రవర్తిస్తూ ఉంటుంది? బాప్‌రే — చాలా సెన్సిటివ్! అనుకున్నాడు. వాళ్ళంతా ఏదో పార్టీ అరేంజ్ చేసుకుంటారల్లే ఉంది. ఇక మనం ఇక్కడి నుంచి తొలగిపోవడం మంచిది అనుకుని కాన్వాసును ఫ్రేమ్ నుంచి వేరుచెయ్యబోయాడు. రంగులు ఇంకా ఆరలేదు. మరో గంట కాలమైనా కదపటానికి వీలులేదు. అనాలోచితంగానే ఆ చిత్రాన్ని చూస్తూ నిలుచుండిపోయాడు. క్షణాలు దొర్లక పూర్వమే ముకుంద సుడిగాలిలో గదిలోకి వచ్చింది. వదనం ఎర్రబారి ఉంది. అసహనంగా ఊపిరి విడుస్తూం దామె. నిర్లిప్తంగా చిత్రాన్ని చూస్తున్న సుదర్శనం ఆమె రాకతో మర్యాద పాటించి, "కూర్చోండి" అన్నాడు.

"నేను కూర్చోవటానికి రాలేదు. మీరు గీసిన ఆ చిత్రం ఎవరిది?!" సూటిగా ప్రశ్నించింది.

"అరుణా మిల్స్ వారిది!" ఆన్సర్ టు ది పాయింట్ అన్నట్టు చెప్పాడు.

"జోకులు వెయ్యద్దు. ఎవర్ని చూసి వేశారు దాన్ని అని అడుగుతున్నాను."

ఆమె అధికారానికి నవ్వుకున్నాడు. "మీ అందంలో ఒక హుందాతనం ఉంది. కోపంతో దాన్ని చెడగొట్టకండి. ఇట్స్ మై హార్టీ సజెషన్!"

"నేను కోరుతున్నది సమాధానం. సజెషన్ కాదు. ఎవర్ని చూసి వేశారు దాన్ని?"

ఈసారామె నేత్రాలు అసహనంగా కదులాడినాయి. సుదర్శనం బుద్ధిగా సమాధానం చెప్పాడు.

"ఒక మాడల్‌ని చూచి వేశాను. పేరు చంద్రికా రాణి!"

"అబద్ధం!...చంద్రికారాణి కాదు!... సులేమా! !"

సులేమా !!? ... ఈ మారు సుదర్శనం ఆశ్చర్యపోయాడు. అయి ఉండవచ్చు. ఆమె అందంలో తెలుగుదనం లేదు. మహమ్మదీయుల తీరుతెన్నులు కనిపించా యా సోయగంలో అనుకున్నాడు.

"అబద్ధం ఆడి, దాచవలసిన అగత్యం నాకేం లేదు!" సమాధానం చెప్పాడు.

"అగత్యం మీకు లేకపోవచ్చు! కాని, దాచుకోవలసిన అగత్యం దానికి ఉంది. కాని, ఎందు కిలా చేసింది! ... ఇలాగే! మీరు ... చిత్రించినట్లే మీ ముందు కూర్చుని వ్రాయించుకుందా!" ఎగిరిపడుతున్న వక్షోజాలు ఆమెలో ఉరకలు వేస్తున్న ఉద్రేకానికి సూచికల్లా ఎగసిపడుతున్నాయి. పళ్ళ బిగువున ఆవేశాన్ని అణచుకుంటూంది.

"ఊహామూర్తుల్ని చెక్కాలనుకుంటే మాడల్ ఎందుకు?!" ఎదురు ప్రశ్న వేశాడు.

సమాధానం చెప్పలే దామె. కొద్ది క్షణాలు నేలను చూస్తూ ఉండిపోయింది. "దీన్ని మీరు ఎందుకోసం వాడుకోదలిచారు? !"

"అరుణా మిల్స్ వారి పబ్లిసిటీ కోసం చిత్రించాను."

"పబ్లిసిటీకా!?"

"అవును. కేవలం నడివీథిలో నిలువెత్తు బొమ్మగా తయారుచేసి, బట్టల ప్రచారం చెయ్యడానికి ఈ కళామూర్తిని పెట్టబోతున్నాను." తెలియకుండానే ఆవేశం ప్రవేశించిం దతనిలో. హృదయంలో తిరుగుబాటు కెరటం విరగబడింది.

"కళను మీ రింత చీప్‌గా వాడుకుంటారా! ఇందుకు ప్రతిఫలంగా ఏమాశిస్తున్నారు మీరు!" ఆమె చూపులో కదిలిన అలతి భావానికి తట్టుకోలేకపోయాడు.

"రూపాయిల్లో లెక్కేస్తే, ఈ వ్యాపార కళకు పదహారు వందల వరకు ముడుతుంది. అయితే, అంతకుమించి ఆత్మ సంతృప్తి నశిస్తుంది. ప్రాఫిట్ నిల్!" ఆంతర్యం వెళ్ళగక్కకుండా ఉండలేకపోయాడు.

"అంత అయిష్టంతో దా న్నెందు కలా అపభ్రంశం చేస్తారు? ఆ ధర నే నిస్తాను, చిత్రాన్ని నా కివ్వగలరా?" అభ్యర్థించిం దామె.

"క్షమించండి! అది నా వృత్తి ధర్మానికి

లోక బాంధవి దారుశిల్పి: శ్రీమతి మణినారాయణ్ (బొంబాయి–6)



చింది.

రంగులు— జ్వాలలు! !— రక్తమ్! ! — రక్తి! ! బాపన— భీతి! ! ఒకదాని కొకటి పోటీపడి, చిక్కపడి ఆకారంగా చైతన్యాన్ని పొందుతున్నాయి.

సుదర్శనానికి స్వేదంతో వెన్నెదురు తడిసిపోయింది. పెదవులు మంటలకు అల్లాడే ఆకుల్లా వణుకుతున్నాయి. కుంచె మాత్రం కాన్వాసుమీద విశృంఖల నృత్యం కొనసాగిస్తూనే ఉంది. కాళిక నాలుక ల్లాంటి జ్వాలాశిఖల్ని చిత్రిస్తూనే ఉంది. ఆ జ్వాలమధ్య చిక్కుకున్న అబల చిత్రం— రక్షించమని, ఎక్కడెక్కడో కూపాంతరాలలో, కూరుకుపోతున్న గొంతుక పెగుల్చుకుని, మృత్యువు కౌగిలి లోంచి తన్ను విడిపించమని చావుకేక పెడుతూంది. అందరాని, అందుకోలేని ఆ అగాధపు లోతు సుదర్శనం చేతకాని తనానికి వెక్కిరిస్తూ నవ్వుతూంది.

ఆ ధ్వని, ఆ కరాళ నిస్వనం — తన చుట్టూ పదింతలై, పరివ్యాప్తమై, గుండెను వ్రయ్యలు చేస్తూ, పదేపదే వికటాట్టహాసం చేస్తూంది. గుండెలపై ఎవ్వరో సమ్మెటతో బాదుతున్నారు. ఆ బాధ భరించరానిదై— "అమ్మా! ! . . . నీలా ! ! !" అంటూ గావుకేక పెట్టాడు. కుంచె గాలిలోనికి ఎగిరి పోయింది. కుప్పగా కూలిపోయాడు. అప్పుడే గదిలో అడుగు పెట్టిన వెంకటేశం ఆ కేకకు అదిరిపడ్డాడు. "ఏమైందండీ?" అంటూ గది మధ్య పడి ఉన్న సుదర్శనాన్ని లేవనెత్తి సోఫాలో కూర్చుండబెట్టాడు. మొహం మీద నీళ్ళ చల్లి ఫాన్ ఆన్ చేశాడు.

"ఏమయింది, సార్!" అంటూ యువజాని కళ్ళలోకి ఆత్రంగా చూస్తూ నిలుచున్నాడు. సుదర్శనం క్రమంగా ఇహం లోనికి వచ్చాడు. తల విదుల్చుకున్నాడు. "ఏం, ఏమయింది? ఎందు కలా చూస్తు న్నావ్?" అంటూ లేచాడు. ఎదురుగా కాన్వాసుమీద మంటలు కనిపించాయి. బరువెక్కిన గుండెలతో వాటిని చూస్తూ సోఫాకు చారబడి ఉండిపోయాడు. అతని నేత్రాలు వర్షంతో బరువెక్కినవరివెన్నుల వలే అవనత ముఖాలై ఉన్నాయి. వెంకటేశం కాన్వాసును చూసి నివ్వెరపోయాడు.

"అదేమిటి, సార్, అరుణా మిల్స్ వారి బొమ్మమీద మంటలు వేశారు! ? అదేమిటి, ఆ మాడల్ అమ్మాయిని అలా మార్చేశారు!. .." ఆ పైన ఏం మాట్లా డాలో తెలియక విస్మయపాటుతో ఉండి పోయాడు.

"అది అరుణా మిల్స్ వారిది కాదు. నీలది! . . . నా నీలది! ! నిలువెల్లా దహించుకుపోతూ క్షణ క్షణానికి నా నించి దూరమై పోతున్న నీలది! ఈ చిత్రం ఎవ్వరికీ ఇవ్వదలచ లేదు. నాతోనే, నా లోనే నిలుపుకోవాలి దీన్ని!" స్థిరంగా అన్నాడు.

"మరి వాళ్ళకేం జెపుతారు?! ఎగ్రిమెంట్ మాటో?!" అయోమయంగా అడిగాడు వెంకటేశం.

సమాధానం చెప్పలేదు సుదర్శనం. "ఏమయినా దీన్ని మాత్రం ఇవ్వను! పోయి నీ పని చూసుకో!" అని హెచ్చరించి, జారి నేలపై వడ్డ తెరను కాన్వాసుపై కప్పివేశాడు.

అలసట శరీరాన్ని కమ్ముకోగా నీరసంగా సోఫాలో జారగిలపడి ఇంటి పైకప్పు కేసి ఉదాసీనంగా చూస్తూ ఉండి పోయాడు.

వీథిగేటు దగ్గర కారాగిన చప్పు డయింది. లేచి చూడాలనిపించలేదు. ఎవ్వరో తన గదిలో అడుగు పెట్టిన చప్పుడయింది గాని, తల తిప్పి చూడాలని పించలేదు. అలాగే శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు. కొద్ది క్షణాల తరవాత తన ఎదురు సోఫాలో ముకుంద కూర్చుని ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. "మీరా!. . . ఎంత సేపయింది వచ్చి?" అంటూ సర్దుకుని కూర్చున్నాడు.

"ఇప్పుడే! మిమ్మల్ని డిస్టర్బ్ చేసి ఉంటే క్షమించండి— నేనూ. . ."

సుదర్శనం ఆమె మాట మధ్యలోనే లేచిపోయాడు. "క్షమించండి! ఆ చిత్రాన్ని నే నివ్వలేను. అదీ..."

అతని వాక్యం పూర్తికాకుండానే "ఇప్పు డా చిత్రం ఇవ్వవలసిన అవసరం లేదు!" అంది—

గొంతు జీరబోయింది. ఆమె ముఖ మెందుకో నల్లగా వాడిపోయి ఉంది.

"కారణం!?" ఆశ్చర్యంగా ప్రశ్నిం చాడు.

"ఎవరి మర్యాద కాపాడాలని దాన్ని కొనదలిచానో అది ఇప్పుడు లేదు."

"అంటే!" ఆత్రతగా అడిగాడు.

"సులేమా చనిపోయింది ! !"

"ఆ! !. . ."

"అవును. . . చనిపోయింది. కిరస నాయిలు పోసి నిప్పంటించుకుంది. ఆత్మహత్య చేసుకుంది."

ఆ పైన ఆమె చెప్పలేక వెక్కి వెక్కి ఏడవసాగింది. సుదర్శనం గుండెలు చలితో గజగజ లాడాయి. "నిజమా! ... ఎందు కిలా జరిగింది! ... ఎవరు దీనికి కారణం! !" బిగ్గరగా ప్రశ్నించాడు. బదులుగా ముకుంద చేతిలోని కాగితం అతని కాళ్ళముందు పడింది. ఆత్రతగా తీసి చదివాడు.

"ముకుందా!

అప్పూరాలైన నీకుకూడా తెలియ



వెన్నముద్దలు — బి. చంద్ర (రామగుండం)

కుండా నే చేసిన క్షుద్రతపస్సు బూడిదయై పోయిన వేళ పశ్చాత్తాపంతో వ్రాస్తు న్నాను. నీకు నిజం చెప్పెయ్యకపోతే నా ఆత్మకు శాంతి ఉండదు. వేణుని ప్రేమించాను. కాదు, ఆరాధించాను. ప్రయోజకుణ్ణి చేసుకోవాలని అతని చదువు కోసం మాడల్ గర్ల్‌గా, ట్యూషన్లు చెప్పి, చివరకు ఒకటి రెండు పార్సు నాటకాల్లో వేషాలుకూడా వేశాను. నాకు తెలుసు—నీ కిది తెలిస్తే అసహ్యించు కుంటావు. బాధపడతావు. ఇప్పటికే నేను నీకు భారంగా ఉన్నాను. ఇంకా బరువు మోపలేక ఈ సాహసం చేశాను. క్షమించు. వేణు చదువు పూర్తి చేశాడు. వరంగల్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం కుదిరింది. ముందుగా ధరావత్తు కట్టా లని, మూడు వందలు కావాలని ఉత్తరం వ్రాశాడు. తపస్సు ఫలించేవేళ అసన్న మయిందన్న సంతోషంతో ఒక చెట్టియార్ కంపెనీకి మాడల్‌గా ఉండి మూడు వందలూ సంపాదించాను. నే పెంచిన మొలక మహా వృక్షమై ఫలి స్తూంటే ఆశతో అందుకోవాలని, ఆ బోదెకు హత్తుకు పోవాలని కలలు కన్నాను. ఇక్కడే నేను ఘోరంగా దెబ్బ తిన్నది. వేణుకూడా అందరిలాగే మగవాడు. నేను పెళ్ళేసరికే పది వేల కట్నానికి అమ్ముడు పోయాడు. ఆ మామగారు కట్టిన ధరావత్తుతో ఉద్యోగంలో చేరిపోయాడు. పైగా నేను శీలవతిని కానని, నా లాంటి పథవిహీనను కట్టుకొని భవిష్యత్తును అంధకారం చేసుకోలేనని మొహం మీద చెప్పేశాడు. చాలు, ముకుందా! ఆత్మ వంచన చేసుకొని ఇన్నాళ్ళు నే చేసిన తప్పిదానికి ఈ శిక్ష చాలు. ఇంక జీవించా లని లేదు. ఆఖరిసారి మనసు విప్పి నా పాపాన్ని నీ ముందు కడిగేసుకోవాలని వ్రాస్తున్నాను. ఇది నీకు అందే వేళకు నేను ఉండను. సెలవు. మన్నించు.

—నీ సులేమ."

"నెవ్వర్!. . . నెవ్వర్! ఇట్ షుడ్ బి హాపెన్డ్! ! అలా జరగటానికి వీల్లేదు!" గట్టిగా కేక పెట్టాడు సుదర్శనం. "నేను హంతకుణ్ణి కాలేను. కాలేను . . .ప్లీజ్ హెల్ప్ మి!" పిచ్చిగా జుత్తు పీక్కున్నాడు.

"ఏమిటి మీ రంటున్నది! సులేమను చంపింది మీరా!" ఆశ్చర్యపోయింది ముకుంద.

"అవును, నేనే! ఆ అమాయకురాలిని, అపహాయను చంపింది నేనే! ఉద్ధరించ డం చేతకాక, అసమర్థుడనై కౌశికుడు మహాపతివ్రతను శపించినట్లు, ఆమెను నేనే శపించాను. చేతులారా మంటల్లో బూడి చేశాను. చూడు— చూడు, నేను చేసిన కిరాతకాన్ని, ఘాతుకాన్ని చూడు!"

కాన్వాసు మీది తెరను పరమని చింపివేశాడు. ఆశ్చర్యం! . . ఎదురుగా మంటల మధ్య కాలి బూడిదయ్యి పోతూ ఆదుకొమ్మని ఆర్తితో అలమటిస్తున్న సులేమ చిత్రాన్ని చూసి అవాక్కయి నిలుచుండిపోయింది ముకుంద. 'భగవాన్! ఎంతటి యాదృచ్ఛిక మిది! ' ఆక్రోశిం చిం దామె అంతర్యం! "కాదు, నే గీసిన శాపం!" కుప్ప కూలి పోయాడు సుదర్శనం. ★